క్లుప్తంగా

ఇంత నిర్లక్ష్యమా?

స్తంభాలు తొలగించకుండా రోడ్డు పనులు



చెన్నారావుపేట : రోడ్డు వెడల్పు పనుల్లో భాగంగా అడ్డుగా ఉన్న విద్యుత్ స్తంభాలు తొలగించకుండానే నిర్మాణ పనులు చేయడంపై గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. చెన్నారావుపేట మండల కేంద్రంలో రోడ్డు వెడల్పు పనులు చేస్తున్నారు. ఇందులో భాగంగా అడ్డుగా ఉన్న ఇళ్లను తొలగించారు. ప్రజలు నష్టపోయినప్పటికి రోడ్డు అభివృద్ధి పనులకు సహకరించారు. మరి అడ్డుగా ఉన్న విద్యుత్ స్తంభాలు కూడా తొలగించాలి కదా.. వాటిని తొలగించకుండానే పనులు ఎలా చేస్తారని ప్రశ్నిస్తున్నారు. విద్యుత్‌శాఖ నిర్లక్ష్యమా.. ఆర్ అండ్‌బీ అధికారుల పట్టింపు లేని తనమో తెలియదు. రోడ్డుకు అడ్డుగా ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ స్తంభాలను తొలగించి రోడ్డు పనులు చేపట్టాలని ప్రజలు, ప్రయాణికులు కోరుతున్నారు.

ప్రత్యేక పూజలు

వర్ధన్నపేట: బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు అరూరి రమేశ్ గురువారం ఉదయం వరంగల్ పట్టణ పరిధిలోని భద్రకాళి, ఎర్రగట్టు, సాయిబాబా దేవాలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఐనవోలు మల్లికార్జునస్వామికి పూజలు చేసి రెడ్డిపాలెంలోని చర్చిలో ప్రార్థనలు నిర్వహించారు. పర్వతగిరి మండలంలోని అన్నారం షరీఫ్‌లో పూజలు చేశారు.

సంగెంలో..

సంగెం : మండల కేంద్రంలోని సంఘమేశ్వరాలయంలో పరకాల బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి చల్లా ధర్మారెడ్డి, జ్యోతి దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. గురువారం ఉదయం సంఘమేశ్వరాలయంలో ఆలయ పూజారి నాగార్జున శర్మ ప్రత్యేక పూజలు నిర్వహించి సంఘమేశ్వరుడి ఆశీస్సులు అందజేశారు. ఎంపీపీ కళావతి, జెడ్పీటీసీ సుదర్శన్‌రెడ్డి, గుండేటి బాబు, సారంగపాణి పాల్గొన్నారు.

ముమ్మరంగా ఎన్నికల ప్రచారం

సాక్షి నెట్‌వర్క్ : అసెంబ్లీ ఎన్నికల దృష్ట్యా నర్సంపేట, వర్ధన్నపేట, పరకాల నియోజకవర్గాల్లో ఆయా పార్టీల నాయకులు ముమ్మరంగా ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా నర్సంపేట నియోజకవర్గ వ్యాప్తంగా బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి పెద్ది సుదర్శన్‌రెడ్డి, కాంగ్రెస్ అభ్యర్థి దొంతి మాధవరెడ్డి తమ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఇంటింటా తిరుగుతూ ఓట్లు అభ్యర్థిస్తున్నారు.తమ నాయకులను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని మండల స్థాయి నాయకులు సైతం ప్రచారం చేస్తున్నారు. పరకాల నియోజక వర్గంలోని సంగెం మండలంలో గల గొల్లపల్లి, మొండ్రాయి, నార్లవాయి, నల్లబెల్లి గ్రామాల్లో బీజేపీ అభ్యర్థి డాక్టర్ పగడాల కాళీప్రసాదరావు గురువారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు.

అనుమతి లేకుండా నిర్మాణాలు చేపడితే చర్యలు



దామెర : అనుమతి లేకుండా నిర్మాణాలు చేపడితే చట్టపరంగా చర్య తీసుకుంటామని మండల పంచాయతీ అధికారి రంగాచారి అన్నారు. మండల కేంద్రంలోని సర్వే నంబర్ 328–డీ–2లోని పోలసాని విమలరవీందర్‌రెడ్డి గ్రామ పంచాయతీ కార్యాలయం నుంచి అనుమతులు తీసుకోకుండా ఇంటి నిర్మాణ పనులు చేపట్టగా గ్రామ పంచాయతీ నుంచి నోటీసులు జారీ చేశారు. అయినప్పటికీ వారు నోటీసులను బేఖాతరు చేసి నిర్మాణాలు కొనసాగించారు. దీంతో అనుమతి లేకుండా చేపట్టిన నిర్మాణాలను గ్రామ పంచాయతీ సిబ్బంది జేసీబీ సాయంతో గురువారం కూల్చివేశారు. ఈ సందర్భంగా ఎంపీఓ మాట్లాడారు. ఇంటి నిర్మాణం, ప్రహరీ నిర్మాణాలు చేపట్టేవారు గ్రామ పంచాయతీల నుంచి అనుమతులు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఇంజపెల్లి నరేష్, కారోబార్ బొబ్బిలి, గ్రామ పంచాయతీ సిబ్బంది ఉన్నారు.

ఇద్దరికి గాయాలు

కేసముద్రం: రోడ్డుపై ఆగిఉన్న లారీని ప్రమాదవశాత్తు ఆటో ఢీకొట్టిన సంఘటన మండలంలోని పెనుగొండ గ్రామ క్రాస్‌రోడ్డు వద్ద గురువారం సాయంత్రం చోటుచేసుకుంది. ఎస్సై తిరుపతి తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని ఉప్పరపల్లికి చెందిన ఆటోడ్రైవర్ మల్లయ్య ఆటో నడుపుకుంటూ మానుకోటకు బయలుదేరాడు. ఇదే ఆటోలో ఉప్పరపల్లికి చెందిన యాకుబ్‌తోపాటు, మరికొందరు ఎక్కారు. ఈ క్రమంలో పెనుగొండ క్రాస్‌రోడ్డు వద్ద నిలిపిన లారీని గమనించక ఆటో ఢీకొట్టింది. దీంతో మల్లయ్య, యాకూబ్‌కు తీవ్రగాయాలు కాగా మరో నలుగురికి స్వల్పగాయాలయ్యాయి. గాయపడిన వారిని మానుకోట జిల్లా ఆస్పత్రికి తరలించారు.

‘ఓటుహక్కు’పై అవగాహన

వర్ధన్నపేట : వర్ధన్నపేట పట్టణంలో గురువారం మున్సిపల్ కమిషనర్ జోనా ఆధ్వర్యంలో మున్సిపాలిటీ కార్యాలయం నుంచి అంబేడ్కర్ సెంటర్ వరకు ఓటు హక్కును ప్రతీ ఒక్కరు వినియోగించుకోవాలని నినాదాలు చేస్తూ ప్లకార్డులు చేత బూని ర్యాలీ చేపట్టారు. అనంతరం కరపత్రాలు ప్రదర్శిస్తూ మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ఓటు వజ్రాయుధమని, ఓటు వినియోగంలో నిర్లక్ష్యం చేయవద్దని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ రంగయ్య, అంగన్‌వాడీ టీచర్లు, ఆశ వర్కర్లు, మెప్మా, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.



అవగాహన కరపత్రాలు ప్రదర్శిస్తున్న అధికారులు, సిబ్బంది

నియామకం



బి. కమలహాసన్

నెక్కొండ : కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ మండల ఉపాధ్యక్షుడిగా బిర్రు కమలహాసన్‌ను నియమించామని ఆ పార్టీ మండల అధ్యక్షుడు బక్కి అశోక్ తెలిపారు. గురువారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ.. ఏఐసీసీ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి, టీపీసీసీ సభ్యుడు సొంటిరెడ్డి రంజిత్‌రెడ్డిల ఆదేశాల మేరకు మండలంలోని పెద్దకొర్పోలు గ్రామానికి చెందిన సీనియర్ నాయకుడు కమలహాసన్‌కు నియామక పత్రం అందించామన్నారు. పార్టీకి చేస్తున్న సేవలను గుర్తించి ఎస్సీ మండల కమిటీలో స్థానం కల్పించామన్నారు. తన నియామకానికి సహకరించిన పార్టీ ముఖ్య నాయకులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి రావుల హరీష్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు పెండ్యాల హరిప్రసాద్, నాయకులు గై లక్ష్మణ్, రాచకొండ రఘు, మెండె కుమారస్వామి, బొడ్డుపల్లి యాదగిరి, ఈదునూరి సాయికృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడిగా రాజ్‌కుమార్



లెంకలపల్లి రాజ్‌కుమార్

దుగ్గొండి : యూత్ కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షుడిగా రేకంపల్లి గ్రామానికి చెందిన లెంకలపల్లి రాజుకుమార్ నియమితులయ్యారు.ఈ మేరకు ఏఐసీసీ సభ్యుడు దొంతి మాధవరెడ్డి గురువారం నియామక పత్రం అందించారు. అనంతరం రాజ్‌కుమార్ మాట్లాడారు. మండలంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు. తన నియామకానికి సహకరించిన నియోజకవర్గ, మండల నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

14న ప్రాంగణ నియామకాలు

నర్సంపేట : నర్సంపేటలోని భద్రకాళి ఒకేషనల్ జూనియర్ కళాశాలలో ఈనెల 14వ తేదీన ఎంఎస్ఎన్ లాబొరేటరీస్ హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో ప్రాంగణ నియామకాలు నిర్వహిస్తున్నట్లు కళాశాల చైర్మన్ గాదె రమేష్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. నియామకాలకు నర్సంపేట డివిజన్ పరిధిలోని అన్ని ఒకేషనల్ కళాశాలల విద్యార్థులు (ఎంఎల్‌టీ పూర్తయిన వారు), జూనియర్ కళాశాలల విద్యార్థులు ఎంపీసీ, బైపీసీ పూర్తయిన విద్యార్థులు అర్హులని తెలిపారు. 2022–23లో పూర్తి అయిన విద్యార్థులు, 20 సంవత్సరాల లోపు ఉన్న వారు అర్హులని పేర్కొన్నారు. నియామకాలకు హాజరయ్యే అభ్యర్థులు ఎస్ఎస్‌సీ మెమో, ఇంటర్ మెమో, ఆధార్ కార్డు, రెండు పాస్ పోర్ట్ సైజ్ ఫొటోలతో హాజరు కావాలన్నారు. వివరాలకు 98667 76874, 97003 27130 నంబర్లలో సంప్రదించాలని తెలిపారు.

15 లీటర్ల గుడుంబా స్వాధీనం

- ద్విచక్ర వాహనాలు సీజ్
- ఇద్దరిపై కేసు నమోదు

నర్సంపేట రూరల్ : అక్రమంగా తరలిస్తున్న గుడుంబా, రెండు ద్విచక్ర వాహనాలను పట్టుకొని సీజ్ చేసి ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు నర్సంపేట ఎక్సైజ్ సీఐ నరేష్ రెడ్డి తెలిపారు. నర్సంపేట పట్టణ శివారులో రూట్ వాచ్ చేస్తుండగా ద్విచక్ర వాహనాలపై 15 లీటర్ల గుడుంబా, 50కిలోల బెల్లం, రెండు కిలోల పటిక, డ్రై ఈస్ట్ పౌడర్ లభ్యమైందని, వెంటనే వాటిని సీజ్ చేసి కొత్తగూడ మండలం పొగుళ్లపల్లి గ్రామానికి చెందిన భూక్యా తిరుపతి, నెక్కొండ మండలంలోని గ్యాంగ్ తండాకు చెందిన బానోత్ సురేష్‌లపై కేసు నమోదు చేసినట్లు ఎక్సైజ్ సీఐ తెలిపారు. ఈసందర్భంగా సీఐ మాట్లాడుతూ.. ప్రభుత్వం నిషేధించిన బెల్లం, పటిక, గుడుంబాను అక్రమంగా ఎవరు రవాణా చేసిన చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు. తెలంగాణ శాసనసభకు ఎన్నికలు జరుగుతున్నందున అనధికారికంగా మద్యం నిల్వలు, సరఫరా చేసిన సమాచారం అందించాలని కోరారు. టోల్‌ఫ్రీ నెంబర్ 1800 425 2523, 0870 2930190, 87126 59016లకు సమాచారం అందించాలని సూచించారు. ఈ తనిఖీలో సిబ్బంది పాల్గొన్నారు.



పట్టుబడిన గుడుంబా, ద్విచక్రవాహనాలను చూపిస్తున్న ఎక్సైజ్ సీఐ నరేష్‌రెడ్డి, సిబ్బంది

యోగా, ధ్యానంపై శిక్షణ



శిక్షణలో పాల్గొన్న విద్యార్థులు

పర్వతగిరి : మండల కేంద్రంలోని జెడ్పీఎస్ఎస్‌లో శ్రీరామకృష్ణ పిరమిడ్ ఆధ్వర్యంలో గురువారం యోగా, ధ్యానంపై విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు బి.రమేష్ మాట్లాడుతూ.. యోగా, ధ్యానం వల్ల విద్యార్థుల్లో క్రమశిక్షణ, ఏకాగ్రత పెరుగుతుందన్నారు. జీవన ప్రమాణం ప్రశాంతంగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బీసీలను ఓట్లు అడిగే హక్కు ఆ పార్టీలకు లేదు

- బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పెసరు విజయ్‌చందర్‌రెడ్డి

పరకాల: బీసీలను ఓట్లు అడిగే నైతిక హక్కు కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలకు లేదని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డాక్టర్ పెసరు విజయ్‌చందర్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని మండల రూరల్ కార్యాలయంలో గురువారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చని బీఆర్ఎస్ మళ్లీ ఓట్లు అడగడం విడ్డూరంగా ఉందన్నారు. పరకాల అభివృద్ధిలో వెనుకబాటుకు స్థానిక ఎమ్మెల్యేనే కారణమని ఆరోపించారు. పరకాలను అమరవీరుల జిల్లా చేయాలంటూ ప్రజలు ఉద్యమిస్తుంటే మరోవైపు ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి శ్రీలంక బీచ్‌లో కాలక్షేపం చేసిన విషయాన్ని ప్రజలు ఇంకా మర్చిపోలేదన్నారు. ఈ సమావేశంలో మండల అధ్యక్షుడు పుట్ట రవీందర్, జిల్లా ప్రధాన కార్యదర్శి జితేందర్, జిల్లా కార్యదర్శులు రామన్న, శ్రీనివాస్, మండల ప్రధాన కార్యదర్శి రాజేందర్‌రావు, కిసాన్ మోర్చా ఉపాధ్యక్షుడు కొమ్మిడి మహేందర్‌రెడ్డి, మెడికల్ సెల్ కన్వీనర్ కసగాని రాజ్‌కుమార్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న విజయ్‌చందర్‌రెడ్డి

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



మృదులతకు ప్రశంసపత్రం ఇస్తున్న బాధ్యులు

శాయంపేట : మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాలలో పదోతరగతి చదువుతున్న విద్యార్థిని మృదులత తెలంగాణ కళాఉత్సవ్ పోటీల్లో రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ సుభాషిణిదేవి తెలిపారు. హనుమకొండలో గురువారం జిల్లా స్థాయి కళాఉత్సవ్ పోటీలు నిర్వహించగా మృదులత అత్యుత్తమ ప్రతిభ కనబర్చినట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. జిల్లా సోషల్ ఫోరం అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి, కమిటీ సభ్యులు ప్రశంస పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల యాజమాన్యం, విద్యార్థులు మృదులతను అభినందించారు.

బీజేపీలో చేరిక

గూడూరు: మండలంలోని మట్టెవాడ శివారు సరస్వతి నగర్, బ్రాహ్మణపల్లి, ఇప్పల్ తండాకు చెందిన పలు పార్టీల నాయకులు, కార్యకర్తలు ఆయా పార్టీకు రాజీనామా చేసి, బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి జాటోత్ హుస్సేన్‌నాయక్ సమక్షంలో చేరారు. ఈ సందర్భంగా బీజేపీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ నాయిని ధర్మారెడ్డి, మేరెడ్డి సురేందర్, వెంకన్న, దేవేందర్‌రావు, రాంబాబు, బొప్పిడి శేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అసెంబ్లీ ఎన్నికల్లో భాగంగా ప్రధాన పార్టీలు కాంగ్రెస్ పార్టీ, బీజేపీ అభ్యర్థుల తరఫున కొంతమంది ఎన్నికల రిటర్నింగ్ అధికారులకు గురువారం నామినేషన్లు అందించారు. వీరితో పాటు స్వతంత్ర్య అభ్యర్థులు నామినేషన్లు వేశారు. నామినేషన్‌కు ముందు ముఖ్య నాయకులు, కార్యకర్తలు, ప్రజలతో భారీ ర్యాలీ నిర్వహించారు. – సాక్షి నెట్‌వర్క్



వర్ధన్నపేట: భారత చైతన్య యువజన పార్టీ తరఫున నామినేషన్ పత్రం ఇస్తున్న ఐత ప్రవీణ్



నర్సంపేట: బీఎస్పీ తరఫున నామినేషన్ అందజేస్తున్న మదన్‌కుమార్ సతీమణి రజిత



నర్సంపేట: ఆరెల్లి లలిత



కాంగ్రెస్ అభ్యర్థి తరఫున తక్కళ్లపల్లి రవీందర్‌రావు



స్వతంత్ర అభ్యర్థిగా ప్రేమ్‌లాల్



నర్సంపేట: బీజేపీ.. గటిక అజయ్‌కుమార్



నామినేషన్ దాఖలు చేస్తున్న కాంగ్రెస్ పాలకుర్తి అభ్యర్థి యశస్విని రెడ్డి



నర్సంపేట: బీజేపీ తరఫున నామినేషన్ దాఖలు చేస్తున్న కంభంపాటి పుల్లారావు

ఎస్సీ వర్గీకరణ చేపట్టాలి

తొర్రూరు: శీతాకాల పార్లమెంట్ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లుకు చట్టబద్ధత కల్పించాలని ఎంఈఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సోమారపు ఐలయ్య, జాతీయ కార్యవర్గ సభ్యుడు వెల్తూరి దిలీప్ డిమాండ్ చేశారు. ఈ నెల 11న హైదరాబాద్‌లో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో తలపెట్టిన మాదిగల విశ్వరూప మహాసభ కరపత్రాలను గురువారం డివిజన్ కేంద్రంలో ఎంఈఎఫ్ నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సభకు ప్రధాని మోదీ ముఖ్య అతిథిగా హాజరు కానున్నారని, ఈ సభలో వర్గీకరణపై స్పష్టమైన ప్రకటన చేస్తారని ఆశిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంఈఎఫ్ ప్రతినిధులు తాటికాయల సురేందర్, కుంటకొమ్ము భిక్షపతి, ఈదురు రమేష్, కుమార్, మల్లిక్ పాల్గొన్నారు.

జీవాలకు టీకాలు వేయించాలి

హసన్‌పర్తి: పీపీఆర్‌వ్యాధి నివారణకు హనుమకొండ జిల్లా వ్యాప్తంగా 4.65లక్షల గొర్రెలు, 65వేల మేకలకు టీకాలు వేయనున్నట్లు జిల్లా పశు సంవర్థకశాఖ అధికారి డాక్టర్ వెంకటనారాయణ తెలిపారు. హసన్‌పర్తి మండలం దేవన్నపేటలో పీపీఆర్ టీకా శిబిరాన్ని ఆయన గురువారం సందర్శించి గొర్రెలకు టీకాలు వేశారు. అనంతరం వెంకటనారాయణ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ఇరువై రోజుల పాటు ఆయా గ్రామాల్లో ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేసి పీపీఆర్ టీకాలు ఉచితంగా వేయనున్నట్లు చెప్పారు. ఈనెల 19వ తేదీ వరకు టీకా కార్యక్రమం కొనసాగుతుందని తెలిపారు. పీపీఆర్ వ్యాధికి చికిత్స లేదని, నివారణ ఒక్కటే మార్గమన్నారు. ఈ అవకాశాన్ని జీవాల యజమానులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ మండల పశువైద్యాధికారి డాక్టర్ అర్చన, ఎల్ఓ సురేష్, ఎల్ఎస్ఏ నబీ, సిబ్బంది రాహుల్, ఇఫ్తెకార్ అలీ, గొర్రెల పెంపకందారులు తదితరులు పాల్గొన్నారు.

‘ఉపాధి కల్పించడంలో విఫలం’

నర్సంపేట : నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని ఎంసీపీఐ(యూ) నర్సంపేట ఎమ్మెల్యే అభ్యర్థి పెద్దారపు రమేష్ అన్నారు. ఈ మేరకు పట్టణంలోని ఓంకార్ భవన్‌లో గురువారం మోటం సురేష్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. రమేష్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యుడు కుసుంబ బాబురావు, రాష్ట్ర కార్యదర్శి కన్నం వెంకన్న, జిల్లా నాయకుడు సింగతి మల్లికార్జున్, యువజన సంఘం బాధ్యులు ఈర్ల రాజు, కసుబాల సతీష్, బెజ్జంకి రాజేష్, గడ్డం పవన్‌కళ్యాణ్, చామంతుల రతన్, అంజి, రాజు, ఖాజా, ముత్తయ్య, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రమేష్

ఏబీఎస్ఎఫ్ ఆవిర్భావ వేడుకలు



ఏబీఎస్ఎఫ్ ఆవిర్భావ వేడుకల్లో నాయకులు

నర్సంపేట : పట్టణంలోని అంబేడ్కర్ సెంటర్‌లో గురువారం అంబేడ్కర్ స్టూడెంట్ ఫెడరేషన్ ఆవిర్భావ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు ఏబీఎస్ఎఫ్ నాయకులు అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి బొట్ల నరేష్ మాట్లాడుతూ.. ఏబీఎస్ఎఫ్ 19సంవత్సరాలుగా విద్యారంగ సమస్యలపై పోరాటంతో పాటు, సామాజిక అణచివేతలపై ఉద్యమాలు నిర్వహిస్తుందన్నారు. భవిష్యత్‌లో ఎదురయ్యే విద్యారంగ సమస్యలపై ఏబీఎస్ఎఫ్ ముందుండి పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు సిద్ధు, ప్రశాంత్, వినయ్, నరేందర్, రాజ్‌కుమార్, రఘు, రామకృష్ణ, ప్రసాద్, రాకేష్, రమేశ్, మురళి, శీనుతో పాటు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో పలువురి చేరిక



నెక్కొండ: పార్టీలో చేరిన వారితో మాధవరెడ్డి



పర్వతగిరి: కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న శ్రీనివాస్‌నాయక్

నెక్కొండ : మండలంలో పలు గ్రామాలకు చెందిన నాయకులు బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేసి కాంగ్రెస్‌లో చేరినట్లు ఆ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి దొంతి మాధవరెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో గురువారం పార్టీలో చేరిన వారికి ఆయన కాంగ్రెస్ కండువా కప్పి ఆహ్వానించారు. పాత, కొత్తల కలయికలతో పార్టీ శ్రేణులు గెలుపు కోసం కలిసికట్టుగా పాడుపడుతున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ సభ్యుడు సొంటిరెడ్డి రంజిత్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి రావుల హరీష్‌రెడ్డి, అమీన్‌పేట సర్పంచ్ గరికపాటి హన్మంతరావు, పట్టణ అధ్యక్షుడు పెండ్యాల హరిప్రసాద్, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు బండి శివకుమార్, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

పర్వతగిరిలో..

పర్వతగిరి : మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో గురువారం పలువురు బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జాటోత్ శ్రీనివాస్‌నాయక్ పార్టీలో చేరిన వారికి కాంగ్రెస్ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో మండల కిషన్, గొడుగు భిక్షపతి, వంగల రవీందర్, మట్ట కుమారస్వామి, వీరన్న, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ



నోట్‌బుక్స్ పంపిణీ చేసిన లయన్స్ క్లబ్ ప్రతినిధి రాంచందర్‌రావుతో విద్యార్థులు, ఉపాధ్యాయులు

సంగెం : మండలంలోని కాపులకనిపర్తి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు హనుమకొండ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నోట్‌బుక్స్ పంపిణీ చేశారు. గురువారం లయన్స్ క్లబ్ ప్రతినిధి దాత రేవూరి రమణారెడ్డి రూ.10వేల విలువైన నోట్ బుక్స్‌ను విద్యార్థులు రెండు చొప్పున అందించారు. విద్యార్థులు బాగా చదివి ఉన్నత స్థానాలకు చేరాలన్నారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ప్రతినిధులు అన్నమనేని రాంచందర్‌రావు, వినోద్, ఆనంద్, రమేష్, మహేందర్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయురాలు శోభారాణి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

భ్రూణహత్యల నివారణకు కృషి చేయాలి

దామెర: భ్రూణ హత్యల నివారణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఐసీడీఎస్ సూపర్ వైజర్ పద్మావతి అన్నారు. మండలంలోని ఊరుగొండలోని రైతు వేదిక, ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గురువారం బేటీ పడావో–బేటీ బచావో కార్యక్రమంలో భాగంగా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. బాలికలపై వివక్ష తగదని, లింగ భేదం లేకుండా సమానంగా చూసుకోవాలని సూచించారు. బాలికలు సమానత్వం పొందాలంటే విద్య ద్వారానే సాధ్యమని, వారు చదువులో రాణించాలని అన్నారు. ఆత్మరక్షణ కోసం ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీహెచ్ ఈడబ్ల్యూ లావణ్య, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సత్యనారాయణ, ఉపాధ్యాయులు సోమయ్య, శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి వేణుమాధవ్, అంగన్‌వాడీ సిబ్బంది, మహిళలు, విద్యార్థులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న మహిళలు

సాంకేతిక అభివృద్ధి సాధించాలి

మామునూరు: విద్యార్థులు చదువుతోపాటు కృత్రిమ మేధస్సుతో కూడిన సాంకేతిక అభివృద్ధిని సాధించే దిశగా పరిశోధనలు చేయాలని వాగ్దేవి ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ప్రకాశ్, కాయిన్ కన్సల్‌టెన్సీ సీఈఓ దుర్గానవీన్ సూచించారు. ఖిలా వరంగల్ మండలం బొల్లికుంట వాగ్దేవి ఇంజనీరింగ్ కళాశాలలో ఆర్టిఫీషియల్ ఇంటలిజెన్స్, మెషిన్ లర్నింగ్ (సీఎస్ఈ, ఏఐఎంఎల్) ఆధ్వర్యంలో కృత్రిమ మేధస్సు, నూతన సాంకేతిక పరిజ్ఞానంపై జాతీయ స్థాయి శిక్షణ తరగతులు గురువారం జరిగాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రోగ్రామింగ్ స్కిల్స్, కృత్రిమ మేధస్సుతో కూడిన సాంకేతిక అభివృద్ధి సాధించాలని పిలుపునిచ్చారు. కృత్రిమ మేధస్సు మానవ అభివృద్ధికి ఉపయోగపడేలా సాంకేతిక పరిశోధనలు జరగాలని, అందుకు పారిశ్రామిక అనుసంధాన ప్రాజెక్టులు చేయాలని చెప్పారు. సాంకేతిక పరిశోధన రంగంలో అభివృద్ధి కోసం వివిధ ఎన్ఐటీలు, ఐఐటీలతో కలిసి పనిచేయనున్నట్లు తెలిపారు. సమావేశంలో డాక్టర్ తన్వీర్ జహాన్, సలీమ్, శ్వేత, రంజిత్ పాల్గొన్నారు.